ప్రజా సంక్షేమానికి పెద్ద పీట



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద రోజువారీ కార్యాచరణలో భాగంగా నియోజకవర్గ ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు పలువురు ఆహ్వానాలు, వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ.నాగరాజు సూచించారు. కొంపల్లిలోని అదమ మల్లారెడ్డి గార్డెన్స్‌లో 100 మంది ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ఆటోకు నాలుగు దిక్కులా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, ఆటో యజమాని, డ్రైవర్ వివరాలు బోర్డులో పొందుపర్చాలన్నారు. అలాగే మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ నడపవద్దని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌రెడ్డి, సిబ్బంది నవీన్, శుభమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యను పరిష్కరించాలి



జీఎం చంద్రమౌళికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నిజాంపేట్ : ప్రగతినగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. ఈమేరకు ఫర్ ఏ బెటర్ సొసైటీ తరఫున హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జీఎం కూడా సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, మేనేజర్ ఈడీపీ హరికృష్ణ, బీఆర్ఎస్ ఆరో డివిజన్ అధ్యక్షుడు ఉప్పు జస్వంత్, శేషసాయి, సాంబశివరావు, శ్రీకాంత్, బీఆర్ఎస్ ఆరో డివిజన్ యువజన అధ్యక్షుడు సాయి కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ సూచించారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈనెల 31లోగా క్రమబద్ధీకరించుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఇంకా ఎవరికైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

ఈనెల 8న ట్రస్ట్ పదో వార్షికోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ కొలన్ తేజ

నిజాంపేట్ : నల్లమల్లిస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ 10 వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 8న నిజాంపేట్ సప్తపది గార్డెన్స్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి 10 రంగాలకు చెందిన ఉత్తమ మహిళలకు మహిళా పురస్కారాలు అందించనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ చైర్‌పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (రాధా) తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నిజాంపేట్ మాజీ సర్పంచ్ ఎస్.ఎం.సీ మాజీ కార్పొరేటర్ కొలన్ తేజ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఆటాపాట, గాలతంబోలా గేమ్‌షో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పద్మ, మీరాభాయి, పి.శశికళ, సరిత, వీణ, స్రవంతి, రాధిక, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ హైస్కూల్‌లో మోటివేషన్ ప్రోగ్రాం



వేణు కల్యాణ్‌ను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

కుత్బుల్లాపూర్: భాగ్యలక్ష్మీ కాలనీలోని నేతాజీ హైస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లకు సోమవారం మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. వక్తగా వేణు కల్యాణ్ హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చి బాగా చదవాలని, అమ్మనాన్న మనసు నొప్పించవద్దని కోరారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే పరీక్షలపై పలు సూచనలు సలహాలు చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లల మనసెరిగి నడుచుకోవాలని, వారికి తగిన సమయం కేటాయించి మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో సత్ జ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు చింతల మహేశ్, అకాడమిక్ డైరెక్టర్ నందిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

- ముని్సపాలిటీల్లో రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు అంతంతే
- 13 పురపాలికల్లో అవుట్ సోర్సింగ్ కింద 1746 మంది
- ఏళ్లుగా భర్తీ కానీ ఖాళీలు, మరోవైపు విలీన జీపీలు
- పనిచేస్తున్న కార్మికులపైనే అదనపు భారం
- జనాభా ప్రతిపాదికన భర్తీ చేయాలంటున్న పుర ప్రజలు



స్వచ్ఛత లోపం..!

సాక్షిసిటీబ్యూరో: పారిశుద్ధ్య కార్మికుల కొరతతో శివారు పట్టణాల్లో స్వచ్ఛత లోపిస్తోంది. ఇటీవల మరో 28 గ్రామ పంచాయతీలు సమీపంలోని ఏడు పట్టణాల్లో విలీనం కావడంతో సమస్య మరింత జఠిలమైంది. ఏళ్లుగా భర్తీ కానీ పోస్టులతో పురపాలికల్లో శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కొరత అధికంగా కనిపిస్తోంది. డ్రైనేజీలు శుభ్రం చేసే కామాటీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు సరిపడా లేక పోవడంతో పట్టణాల్లో స్వచ్ఛత గాడి తప్పుతోంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఏళ్లుగా పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయక పోవడంతో ఉన్న కార్మికులపైనే అదనపు భారం పడుతోంది.

నిబంధనలకు తూట్లు..

పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట నగరపాలక సంస్థలు, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, నాగారం, తూంకుంట, గుండ్లపోంచపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉండగా, ప్రస్తుతం సుమారు 10 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీనికితోడు ఇటీవల ఘట్‌కేసర్, తూంకుంట, పోచారం, దమ్మాయిగూడ, నాగారం తదితర ఏడు పురపాలక సంఘాల పరిధిలోకి 28 పంచాయతీలు విలీనమయ్యాయి. ఈ మున్సిపాలిటీల్లో 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపైనే అధిక భారం పడుతోంది.

గణనీయంగా పెరిగిన జనాభా..

నగర శివారు 13 పురపాలికల్లో గణనీయంగా జనాభా పెరుగుతుండడంతో సుమారు 10 లక్షల జనాభా దాటింది. ఈ లెక్క ప్రకారం శివారు పురపాలక సంఘాల్లో 2,840 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటోంది. 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అవుట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

ప్యానల్ పోస్టులకే ప్రాధాన్యం..

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటి ప్యానల్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి.అయితే పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉంటున్నాయి.

పురపాలక సంఘాల వారీగా ఇలా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో అవుట్ సోర్సింగ్ కింద 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుండగా, ఇందులో పురపాలికల వారీగా సంఖ్య ఇలా ఉంది. పీర్జాదిగూడలో 56 మంది పారిశుద్ధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపెల్లిలో 188, జవహర్‌నగర్‌లో 90 మంది పని చేస్తున్నారు. అలాగే బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూంకుంటలో 74 మంది పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద సేవలందిస్తున్నారు. ఇటీవల విలీనమైన 28 గ్రామ పంచాయతీల కార్మికుల సేవలను ఆయా మున్సిపాలిటీలు వినియోగించుకుంటుండడంతో వారిని కూడా తమ కార్మికులుగా గుర్తించాలని కోరుతున్నారు.

కార్మికుల ఇళ్ల నిర్మాణానికి సహకరించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కంపెనీ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన స్థలంలో కార్మికులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని ఆల్విన్ హౌసింగ్ సొసైటీ జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీలో 2005లో సర్వే చేపట్టగా స్థలం తక్కువ కావడంతో అప్పటి సీఎం దివంగత రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 3 ఎకరాలు కేటాయించారన్నారు. ఆ భూమిలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్, మున్సిపల్ పర్మిషన్లు కూడా ఇచ్చారన్నారు. కానీ కొందరు ఫిర్యాదు చేయడంతో మండల, మున్సిపల్ అధికారులు కార్మికులను ఇంటి నిర్మాణం చేసుకోకుండా అడ్డుపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వేం నరేందర్‌రెడ్డి త్వరలో అధికారులతో చర్చించి కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)



రామారావు

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి ఆంజనేయులు (27) భార్య ఇద్దరు పిల్లలతో కలిసి కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఇందిరానగర్‌లో నివాసముంటున్నారు. ఫిబ్రవరి 27న మెదక్ జిల్లా దడాయపల్లిలోని జాతరకు వెళ్లాలని అనుకున్నారు. అయితే ఆంజనేయులు ఊరికి వెళ్లి ఇంటికి వచ్చాడు. తన భార్య చెప్పకుండా, తన వెంట రాకుండా పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం వెళ్లి తలుపు కొట్టగా తీయలేదు. దీంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

తాగిన మైకంలో మరొకరు..

తాగిన మైకంలో ఓ వ్యక్తి ఉరేసుకున్నాడు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి రామారావు (35), భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి మూసాపేటలోని జిల్లా బస్తీలో నివాసముంటూ.. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం వచ్చిన భర్తను భార్య ఎక్కడికి వెళ్లావని నిలదీసింది. దీంతో 'నాకే చెబుతావా అంటూ' గొడవ పడి తాగిన మైకంలో భార్యపిల్లలను బయటకు నెట్టేసి తలుపు వేసుకున్నాడు. దీంతో పక్కనే ఉన్న ఆమె సోదరుడి ఇంటికి పిల్లలతో వెళ్లింది. రాత్రి 10 గంటల సమయంలో బంధువులు ఇంటికి రాగా రామారావు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే విషయాన్ని రామారావు భార్యకు తెలపడంతో ఆమె సోదరుడితో కలిసి ఇంటికి వెళ్లింది. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఆదర్శనగర్ సెక్షన్ మేనేజర్ బదిలీ

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం ఆదర్శనగర్ సెక్షన్ మేనేజర్ యాదయ్య సోమవారం మణికొండ డివిజన్ జల్‌పల్లి సెక్షన్‌కు బదిలీ అయ్యారు. గతేడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా యాదయ్య కుత్బుల్లాపూర్‌కు వచ్చారు. దీంతో సోమవారం జీఎం అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదయ్య ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీజీఎంలు రాజేశ్, రవి, వికాస్, సూపరింటెండెంట్ అశోక్ కుమార్, సెక్షన్ మేనేజర్లు శివప్రసాద్, రవి, రోహిణి, రమ్య భారతి, ఝాన్సీ, పూజిత, మహేశ్, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్నాథ్, టెక్నికల్ ఆఫీసర్ వెంకటేశ్, సూపరింటెండెంట్ గణేశ్ తదితరులు యాదయ్య పాల్గొన్నారు.



యాదయ్యను సన్మానిస్తున్న జీఎం అశోక్, అధికారులు

ప్రజావాణిలో 4 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్ వాటర్ కార్యాలయంలోని సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు వచ్చాయి. సూరారం సెక్షన్ సూరారంలో భూగర్భ డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే జగద్గిరిగుట్ట సెక్షన్ భూదేవి హిల్స్ నుంచి నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌కు ప్రతిపాదనలు పంపాలని, అలాగే తాగునీటి పైపులైన్లకు వాల్వులు ఏర్పాటు చేయాలని 2 ఫిర్యాదులు రాగా, చింతల్ సెక్షన్ ఇంద్రాసింగ్ నగర్‌లో లో ప్రెషర్‌లో నీటి సరఫరా వస్తుందని జీఎంకు ఫిర్యాదు చేశారు.

గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం

నిజాంపేట్ : బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల 28వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, విశిష్ట అతిథిగా లాజిక్ పర్స్యూట్ సీనియర్ మేనేజర్ శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకటేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ పెంచుకుంటే అత్యుత్తమ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన బీఎఫ్ఎస్ఐ మైనర్ కోర్స్, దాని ప్రాముఖ్యత, అవకాశాలను వివరించారు. అనంతరం శిరీష మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ప్రథమంగా నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఇదే కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో చీఫ్ మేనేజర్ డీఎస్ఎన్ రాజు చేతుల మీదుగా అత్యున్నత ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంధ్యాల నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ జ్యాగ్గే, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న బీవోబీ సిబ్బంది

కార్మికుల పక్షాన పోరాడేది సీఐటీయూనే



సీఐటీయూలో చేరిన సెంట్రింగ్ కార్మికులు

జీడిమెట్ల: కార్మికుల హక్కులు, చట్టాల కోసం పోరాడేది సీఐటీయూ మాత్రమే అని కుత్బుల్లాపూర్ సీఐటీయూ అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన పలువురు సెంట్రింగ్ కార్మికులు సోమవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సెంట్రింగ్ కార్మికులకు గుత్తేదారులు, బిల్డర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సెంట్రింగ్ కార్మికుల సంఘం నాయకులు కృష్ణ, మధు, దిగంబర్, చంద్రకాంత్, దీపక్, మారుతి, కిశోర్ రవి తదితరులు పాల్గొన్నారు.



కమ్మేసిన గుర్రపుడెక్క..!

దూలపల్లిలోని తుమార్ చెరువు రెండేళ్ల క్రితం వరకు స్వచ్ఛమైన నీటితో కళకళలాడేది. ఎక్కడినుంచి వచ్చిందో ఏమో తెలియదు గానీ మాయదారి గుర్రపుడెక్క ఈ చెరువులో చేరి మొత్తం కమ్మేసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించి చెరువుకు పునర్వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. –సుభాష్‌నగర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సన్మాన్ విల్లాస్, వుడ్స్ కాలనీ, యాదిరెడ్డి బండ, సయ్యద్‌నగర్, వైష్ణవి మెడోస్ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు . అలాగే బాలాజీ ఆస్పత్రి, కాస్ హోటల్, ఎస్‌పీజీ హోటల్, శ్రీని ఎవెన్యూ గేట్ నంబర్ 1,2, అంగడిపేట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శ్రీనివాస్‌నగర్ ఫీడర్‌లో..

సుభాష్‌నగర్: శ్రీనివాస్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ చైతన్య భార్గవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్‌నగర్, ఉమాదేవినగర్, ఎన్టీఆర్ నగర్, లెనిన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయ కోరారు.

9న ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్: కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో గల రాందేవ్‌రావు ఆస్పత్రి ప్రాంగణంలో ఈనెల 9న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా గుండె, కిడ్నీ, లివర్, ఎముకలకు సంబంధించిన పరీక్షలు, షుగర్, కేన్సర్ స్క్రీనింగ్, మహిళలకు అన్ని రకాల గైనిక్, కండ్లు, దంత పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ఈనెల 5లోగా తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, పత్రిక పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 6 నుంచి శిబిరం కొనసాగుతుందని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజావాణిలో 9 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 9 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుత్బుల్లాపూర్ సర్కిల్లో ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 7 ఫిర్యాదులు రాగా అందులో 6 టౌన్ ప్లానింగ్, ఒకటి డ్రైనేజీకి సంబంధించి ఉన్నాయి. అలాగే గాజులరామారం మల్లారెడ్డి అధ్యక్షతన ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ విభాగంపై 2 ఫిర్యాదులు వచ్చాయి.

గాల్లో కార్మికుల ప్రాణాలు..!

- సేఫ్టీ పరికరాలు లేకుండానే విద్యుత్ సిబ్బంది పనులు



కుత్బుల్లాపూర్: విద్యుత్ కార్మికుల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి. సాక్షాత్తు ఏడీఈ, ఏఈ దగ్గరుండి ఎలాంటి సేఫ్టీ పరికరాలు లేకుండానే కార్మికులతో పనులు చేయించడం విమర్శలకు తావిస్తోంది. పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ నుంచి సికింద్రాబాద్ విద్యుత్ శాఖ అధికారులు వైష్ణవి ఎంక్లేవ్ కాలనీ మీదుగా రెండు 11 కేవీ కొత్త ఫీడర్ల లైన్లు వేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆరుగురు కార్మికులతో ఎలాంటి సేఫ్టీ పరికరాలు లేకుండానే పనులు చేయించారు. ఇదే విషయమై 'సాక్షి' ప్రతినిధి వారికి సేఫ్టీ పరికరాలు లేవా..? అని ప్రశ్నిస్తే ఆటోలో హెల్మెట్లు ఉన్నాయని చెప్పడం విశేషం.

దోమల నివారణకు ఫాగింగ్ చేయరూ..!

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో దోమలు విపరీతంగా వృద్ధి చెంది రాత్రిపూట కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అయినా దోమల నివారణకు ఫాగింగ్, మందు పిచికారీ చేయాల్సిన ఎంటమాలజీ డిపార్టుమెంట్ వారు కాలనీలవైపు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంటమాలజీ అధికారులు స్పందించి ఫాగింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ సమీపంలోని సాయినగర్‌లో ఇగ్నైట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు.కార్యక్రమంలో సాయినగర్ వాసులు వైఎస్. ప్రసాద్, అచ్యుత రామయ్య, దుర్గాప్రసాద్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, తులసీ, విష్ణు, ప్రసాద్, బాలకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.